క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మాగనూర్: మహిళా శక్తి ప్రోగ్రెస్ రిపోర్ట్స్‌లో మండలానికి అర్హులైన అభ్యర్థులను గుర్తించి ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ చేయనున్నట్లు ఏపీఎం వనిత కూమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ఆహార తయారి యూనిట్‌లో భాగంగా డైరీ బెనిఫిషరీస్, మిల్క్ పార్లర్, ఫిష్ వెహికిల్, ఫ్రాట్రీ మదర్ యూనిట్, బస్ సౌకర్యం లేని గ్రామాల్లో ఎక్స్‌ప్రెస్ యోజన వెహికిల్ యూనిట్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పూర్తి వివరాల కోసం స్థానిక మహిళ సమైఖ్య భవనంలో అధికారులను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నారాయణపేట (దామరగిద్ద): మండలంలోని గత్ప గ్రామానికి చెందిన ఐఈఆర్‌పీ టీచర్ వెంకట్రాములు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతిచెందగా వెంకట్రాములు కుటుంబానికి ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జెడ్పీ, యూపీఎస్, పీఎస్ ఉపాధ్యాయుల సహకారంతో గురువారం రూ. 1.16లక్షల నగదును జీహెచ్ఎం అన్నపూర్ణ అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి మనో ధైర్యాన్ని కల్పించారు. జీహెచ్ఎం అన్నపూర్ణ మాట్లాడుతూ.. విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన వెంకట్రాములు కుటుంబాన్ని ఉపాధ్యాయ సంఘాలు తమవంతుగా బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్య నారాయణరెడ్డి, బాలాజీ, దశరత్, సీఆర్‌పీ మహిపాల్, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడ మండల సర్వసభ్య సమావేశం

మక్తల్(ఊట్కూరు): మండల పరిషత్ భవనంలో శుక్రవారం 11 గంటలకు ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, నారాయణరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధనుంజయగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నారని, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఉచిత పుస్తకాల పంపిణీ



మక్తల్ (ఊట్కూర్): మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాలు పంపిణీ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం అందించే పుస్తకాలు, ఉపకార వేతనాలను అందుకొని తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. క్రమశిక్షణతో పట్టుదలతో చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, బక్కయ్య, మంజునాథ్, కల్పన, ప్రసన్న పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నర్వ: గత కొన్నేళ్లుగా పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు.. ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, బీమయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో వారిని పూలను చల్లుతు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జీహెచ్ఎం భాగ్యలక్ష్మి, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నర్వ: ఈ నెల 29 శనివారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ జయరాములు శెట్టి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతున్నారన్నారు. ఆయా గ్రామాల ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

'రైల్వే ట్రాక్‌లపై రావడం ప్రమాదకరం'

మక్తల్: రైల్వేషన్ పరిధిలో ఉన్న రైల్వేట్రాక్‌ల వద్ద ఎవరూ ఉండొద్దని, రైలు వచ్చే సమయంలో పట్టాల వద్దకు రావొద్దని మహబూబ్‌నగర్ ఆర్‌పీఎఫ్ ఎస్ఐ సయ్యద్ తాహిసిన్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని యువకులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సంగం బండ బ్రిడ్జి వద్ద కొంతమంది వాహనాలు నిలిపి రైల్వే పట్టాల వద్ద మద్యం సేవించడం, పట్టాలపై రాళ్లు పెట్టడం అలాంటి పనులు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారి కష్టాలు



ఐనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇలా (ఫైల్)

- వాహనదారులకు తప్పని అవస్థలు
- వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మక్తల్ (కృష్ణా): ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామాల స్థితిగతులు మారడం లేదు. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం బాగుండాలి. కాని నేటికీ మారుమూల గ్రామాలకు రోడ్డు నిర్మాణం కలగానే మిగిలిపోయింది. ఫలితంగా జిల్లాలోని పలు గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని చేగుంట రైల్వేస్టేషన్ నుంచి ఐనాపూర్ వరకు లింక్ రోడ్డు ఉన్నా లింగంపల్లి, కుసుమర్తి తదితర గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్ల వెంబడి వర్షాకాలంలో అయితే ద్విచక్రవాహనదారులతోపాటూ పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు గతకొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు కాని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

దెబ్బతిన్న కర్ణాటక సరిహద్దురోడ్డు

మండలంలోని కర్ణాటక సరిహద్దు రోడ్డు నుంచి ఐనాపూర్, చేగుంట, బాడియాల్, సూకూర్ లింగంపల్లి నుంచి గూడూర్ వరకు మట్టిరోడ్డు గుంతలు పడికోతకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులలో ఇటు తెలంగాణ ప్రాంత ప్రజాప్రతినిధులు, అటు కర్ణాటక ప్రాంత ప్రజాప్రతినిధులు ఈ రోడ్ల సమస్యను పరిష్కరిస్తే ఇరు ప్రాంతాల ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోతాయంటున్నారు. అలాగే అటు పక్క ఉన్న కర్ణాటక ప్రాంతంలో మన సరిహద్దు వరకు బీటీ రోడ్లు నిర్మించింది. కానీ మన ప్రాంత అధికారులు ఆ రోడ్ల పరిస్థితిని పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ నిర్మాణం చేపట్టి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారిని మెరుగు పర్చాలి..



చేగుంట గ్రామ రైల్వేస్టేషన్ ప్రాంతంలోని మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో వాహనదారులు వెళ్లక ప్రాణాలు పోతున్నాయి. కనీసం కిలోమీటర్ ఉంటున్న ఈ రోడ్డుకు గ్రావెల్ అయిన వేయించి మరమ్మతులు చేయించాలి. ఈ విషయంపై ఉన్నత అధికారులకు విన్నవించినా పట్టించు కోవడం లేదు.

– గంటి శరణబసవ, ఐనాపూర్ గ్రామం

బీటీ రోడ్డుగా మార్చాలి..



పక్కన ఉన్న కర్ణాటకలోని బాడియాల్ గ్రామానికి వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి. అక్కడి కర్ణాటక ప్రభుత్వం వారి సరిహద్దు వరకు బీటీ రోడ్డుగా గత సంవత్సరం క్రితమే నిర్మించింది. మన ప్రభుత్వం మాత్రం మిగితా రోడ్డును పూర్తి చేయడం లేదు. అలాగే ఈ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సూకూర్ లింగంపల్లికి ఉన్న మట్టి రోడ్డుపూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మారిస్తే ప్రజల ఇబ్బందులు తొలిగిపోతాయి.

– అంజనమ్మ పాటిల్, జెడ్పీటీసీ సభ్యురాలు

అభివృద్ధిలో ముందడుగు..



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట (ధన్వాడ): మండల అభివృద్ధిలో ముందుంటానని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె పరిశీలించారు. గత కొద్దిరోజులుగా కస్తుర్బా గాంధీ పాఠశాలలో అడ్మిషన్‌లకోసం విపరీతంగా దరఖాస్తులు రావడంతోపాటు ఎమ్మెల్యే స్వయంగా తెలుసుకునేందుకు పాఠశాలను సందర్శించినట్లు ఆమె తెలిపారు. ఈమేరకు.. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వివిధశాఖ అధికారులు, ఆయా పాఠశాలల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలో మొత్తం ఎంతమంది విద్యార్థులు అడ్మిషన్ అయ్యారని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నాలుగు వందలమంది విద్యార్థులు అడ్మిషన్‌కోసం దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు. పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని, ఇందుకోసం ఉన్నతాధికారులతో తాను మాట్లాడుతానని ఆమె తెలిపారు. అలాగే మరికల్ కస్తుర్బాగాంధీ పాఠశాల ధన్వాడలో నిర్వహిస్తుండంతో స్థలం సరిపోవడం లేదని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. మరికల్ పాఠశాల కంపౌండ్‌వాల్ పెండింగ్‌లో ఉందని, వచ్చేనెలలోపు పనులుపూర్తిచేసి ప్రారంభిస్తామని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టినా మౌళిక వసతుల కల్పన పనులను వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ సాయి ప్రకాష్, ఎంపీఓ వెంకటేశ్వర్లును ఆదేశించారు. డీఈ నరేందర్, తహసీల్దార్ సిధుజా, ఎంపీడీఓ సాయి ప్రకాష్, ఏఈ ప్రవీణ్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



రికార్డులను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణామచారి

మక్తల్: సంక్షేమ హస్టళ్లకు వచ్చే విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఉండాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణామాచారి అన్నారు. గురువారం బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. భోజనం, నిత్యవసర వస్తువులు, పరిసర ప్రాంతాలను, మరుగుదొడ్లు, అన్నింటిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన హోం వర్కును పూర్తి చేయాలని, హస్టల్ సిబ్బంది అనుమతి లేకుండా ఎవరూ బయటకు రాకుండా ఉండాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చేవాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ మాసుమ్, రేణుక, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేష్



మద్దూర్‌లో..

కోస్గి: ప్రభుత్వ వైద్య రంగంలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులు ఐదు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికుల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కనీస వేతనాల జీఓ 21 గెజిట్ విడుదలై రెండు సంవత్సరాలు గడుస్తున్న అమలుకు నోచుకోవడం లేదన్నారు. వారికి రూ.15600 వేతనాలు చెల్లించాలని జీఓ 60 విడుదల చేసిన ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికులను దోచుకుంటున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సైతం సక్రమంగా చెల్లించడం లేదన్నారు. వేతనాల పెంపుకోసం జులై 3న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం ఆస్పత్రి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా గౌసియా బేగం, భీమమ్మను సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సంఘ నాయకులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

మద్దూరు: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా ప్రకటించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు.. సీహెచ్‌సీ నూతన కమిటీని ఎన్నిక చేశారు. సీహెచ్‌సీ కార్మికుల అధ్యక్షుడిగా కె.రవి, ప్రధాన కార్యదర్శిగా మహేష్, ఉపాధ్యక్షుడిగా భాగ్యమ్మ, బి. కృష్ణవేణి, సహాయ కార్యదర్శులుగా చాంద్‌పాషా, భారతమ్మ, కో–శాధికారిగా లలిల, గౌరవాధ్యక్షుడిగా మధు, ఎస్. సంతోష్, కమిటీ సభ్యులుగా కే. రాజు, రేణుక, సకినాబేగం, దేవమ్మ, రవికుమార్, నవీన్, శ్రీలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ. ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

తహసీల్దార్‌కు కార్మిక సంఘం వినతి

నారాయణపేట (దామరగిద్ద): ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయరాములుకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం పనిని 200రోజులకు పెంచాలని, కూలీల పెండింగ్ డబ్బులను సకాలంలో అందించాలని కోరారు. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సబ్‌డివిజన్ కార్యదర్శి కొండ నర్సింహులు,తాయప్ప, సభ్యులు రైతులు పాల్గొన్నారు.

పేట టు విజయవాడకు డీలక్స్ బస్సు

నారాయణపేట: నారాయణపేట ఆర్టీసీ డిపో నుంచి విజయవాడకు డీలక్స్ బస్సు ప్రారంభించబడిందని డిపో మేనేజర్ లక్ష్మిసుధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట నుంచి మధ్యాహ్నం 3:20 గంటలకు బయలుదేరి విజయవాడకు ఉదయం 3:15 గంటలకు చేరుకుంటుంది. నారాయణపేట నుంచి విజయవాడకు వయా, మక్తల్, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, దేవరకొండ, సాగర్, మాచర్ల, గుంటూరు, విజయవాడ చేరుకుంటుంది. తిరిగి విజయవాడ నుంచి 10:15 గంటలకు బయలుదేరి అదే రూట్లో నారాయణపేటకు రాత్రి 8:30 గంటలకు చేరుకుంటుంది. ఈ సర్వీస్‌కు ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. కావున ఈ ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కార్మికులకు బీమా ప్రత్రాల పంపిణీ



కోస్గి: భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు గురువారం భారతీ సిమెంట్ తరపున ప్రమాద బీమా పత్రాలను ఆ కంపెనీ ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ మేరకు స్థానిక డీలర్ హనుమాన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన నిర్మాణాలకు భారతీ సిమెంట్ ఎంతో పేరు ఎన్నిక గలదన్నారు. ఈ సిమెంట్ వాడకంతో ఇళ్ల నిర్మాణాలు ఇతర సిమెంట్‌లతో పోలిస్తే అన్నివిధాలుగా శ్రేయస్కారమన్నారు. అనంతరం మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. సంస్థ మార్కెటింగ్ ఏఎస్ సీహెచ్ భరత్ కుమార్, టెక్నిషియన్ నితిన్, స్థానిక డీలర్లు రాము, నరేష్ తోపాటు మేస్త్రీలు పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

నారాయణపేట: వరంగల్‌లో జూలై7న జరిగే హలో మాదిగ చలో 30వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కారెప్ప పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల స్థాయి సమావేశం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. రాజ్యాంగబద్ధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఎస్సీలోని అన్ని ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారంగా పంపిణీ జరగాలని, అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటాలకు పురుడుబోసిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించి జులై 7నాటికి మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడి నేటికీ 30 సంవత్సరాలు కావస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎం.అశోక్, బిమేష్, రాములు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టం ఉండాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దూరు: వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం రూపొందించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్మికులకు రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలనే ప్రధాన డిమాండ్ చేస్తూ ఈ సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు.. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. వీరి కుటుంబాలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల జీవన భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నర్సింహులు, కిష్టప్ప, కొండప్ప, హన్మంతు, రాములు, నారాయణ, కతలప్ప, మొగులప్ప, జనార్ధన్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పనులు పూర్తిచేయాలి



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టినా మౌళిక వసతుల కల్పన పనులను వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ జయరాములు కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం మండలంలోని చింతల్‌దిన్నెలో ప్రాథమికొన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఎంపీఓ రామన్నతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటికోసం ఏర్పాటు చేసినా కొళాయి పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు వండె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించి వర్షాకాలంలో ఇళ్ల మధ్యలో మురుగు నిల్వ ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి ఈరప్పకు ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు.

పంటల సాగు వివరాల నమోదు



మద్దెల్‌బీడ్‌లో రైతు నర్సప్ప పొలంలో సర్వే చేస్తున్న ఏఈఓ శివజ్యోతి

నారాయణపేట(దామరగిద్ద): రైతులు సాగు చేసిన పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు తమ పంటల వివరాలు అందజేయాలని ఏఈఓ శివజ్యోతి సూచించారు. ఈ మేరకు.. గురువారం కాన్‌కుర్తి, లోకూర్తి, గడిమున్కన్‌పల్లి, కంసాన్‌పల్లి, ఆశన్‌పల్లి, విఠలపూర్,ఆశన్‌పల్లి, బాపన్‌పల్లి క్లస్టర్ పరిధిలో రైతుల పొలాల్ని పరిశీలించి వానాకాలంలో సాగుచేసిన పంట వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే పంటల సాగు వివరాలను ప్రామాణికంగా తీసుకుంటుందని, రైతులు విధిగా తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు శివజ్యోతి, నరేష్, గోపాల్, స్వప్న, తిలక్‌రత్న, అజయ్, అనిల్ కుమార్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి కృష్ణమాచారి

మాగనూర్: ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి కృష్ణమాచారి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల కోసం తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలో భాగంగా వచ్చిన దరఖాస్తులను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, పనులు పూర్తిచేయాలని తెలిపారు. లబ్ధిదారులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు కావాల్సిన వివరాలను అందజేయాలని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ కీర్తి

నారాయణపేట (ధన్వాడ): ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ కీర్తి అన్నారు. గురువారం మండల కేంద్రలోని కస్తుర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాలలో 1129మంది విద్యార్థులకు ఐరన్ మ్రాతలు వేశారు. అలాగే 5వ తరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రను వేశారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వర్షకాలం కావడంతో జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగమ్మ, కతలప్ప, అనురాధ, చంద్రకళ, శాంతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షంకోసం సప్తభజన..



మక్తల్ (ఊట్కూర్): మండలంలోని శ్రీరాంనగర్ ఆంజనేయస్వామి ఆలయంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని భక్తులు సప్తభజన కార్యక్రమం నిర్వహించారు. ఓంనమః శివాయ అని శివనామ స్మరణ చేస్తూ 18మంది యువకులు విడతల వారిగా భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు శ్రీనివాస్, సునీల్, నర్సింహులు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల టెండర్స్ నోటిఫికేషన్ విడుదల చేయాలి



కాంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న డైరక్టర్లు

నారాయణపేట: చేప పిల్లల టెండర్స్ నోటిఫికేషన్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు ఎ. కాంత్ కుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. జిల్లాలోని పలు గ్రామ సొసైటీలలో ముదిరాజ్‌లకు మత్స్య సహకార సభ్యత్వం చేయడం, మత్స్య సంపదయోజన కింద ఇన్సూరెన్స్ వివరాలు, డిస్టిక్ ఫిషరీష్ ఆఫీసర్ రాణా ప్రతాప్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి నరసింహనాయుడు, డైరెక్టర్స్ హన్మంతు, రామకృష్ణ, ఆనంద్, పెద్ద విజయ్, ఆంజనేయులు, సరిత, వెంకటేష్, ఎదురింటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి

ఆత్మకూర్: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వర్షాకాలంలో శానిటేషన్, ఇంకుడుగుంతలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆత్మకూర్, మదనాపురం మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు లేని కుటుంబాలను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఆదేశించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో మదనాపురం మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆత్మకూర్ ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ నరసింహారావు, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.